క్లుప్తంగా

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇల్లందకుంట: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్ అన్నారు. మండలంలోని సీతంపేట గ్రామంలో గురువారం డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ నిర్మూలనకు యువత, విద్యార్థులు, ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్సైరాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పరిశీలన



దుస్తులను పరిశీలిస్తున్న పీడీ సరస్వతి

మానకొండూర్‌రూరల్: అంగన్‌వాడీ విద్యార్థులకు అందజేసే స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ పనులను మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న కుట్టు కేంద్రానికి అప్పజెప్పారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ పీడీ సరస్వతి గురువారం స్టిచ్చింగ్ సెంటర్‌ను సందర్శించారు. దుస్తులను పరిశీలించి కొలతలతో సక్రమంగా కుట్టాలని, మహిళలకు సూచించారు. కుట్టుపనులు త్వరగా పూర్తిచేసి పిల్లలకు అందించడానికి సహకరించాలన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉచిత విద్య

జమ్మికుంట: పట్టణంలోని జీఎస్ఆర్ ఐటీఐలో సెకండ్ ఫేజ్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకువస్తున్నామని ప్రిన్సిపల్ ముస్కె వీర్రాజు గురువారం ప్రకటనలో తెలిపారు. జమ్మికుంట పరిసర విద్యార్థుల కోసం అవకాశం కల్పిస్తున్నామని, 15వ తేదీతో అడ్మిషన్ల గడువు ముగుస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీల్లో అప్రెంటీషిప్, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9849653964, 9908728405 నంబర్లు సంప్రదించాలన్నారు.

జాతీయ నంది అవార్డు గ్రహీతలకు సన్మానం



సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

చిగురుమామిడి: మండలంలోని లంబాడిపల్లికి చెందిన చందబోయిన పర్శరాములు, చిగురుమామిడికి చెందిన కూతాడి కొంరయ్యను చిగురుమామిడి రంగస్థల కళాకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తెలుగు వెలుగు సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో కరీంనగర్ ఫిల్మ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జూన్ 30న జాతీయ నంది అవార్డు అందుకున్నారు. గురువారం అసోసియేషన్ సభ్యులు శాలువాలతో సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండలఅధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్, సభ్యులు మల్లం బాలయ్య, నిలిగొండ కిషన్, మల్లం శ్రీనివాస్, పోలోజు కుమారస్వామి, వడ్లూరి నరేశ్ పలువురు పాల్గొన్నారు.

పనులు నిలిపిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

చిగురుమామిడి: కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ గత టర్మ్‌లో తన సీఆర్ఐఎఫ్ కోటా నుంచి ఇందుర్తి–గాగిరెడ్డిపల్లి–సుందరగిరి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ. 14 కోట్లు కేటాయించారు, పనులు మధ్యలో నిలిపేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి గురువారం ప్రకటనలో కోరారు. 3న జాతీయ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన ఈఈ కృష్ణారెడ్డికి రాతపూర్వక ఫిర్యాదు చేశామన్నారు. ఇందుర్తి నుంచి సంగోజిపేట చెరువుకట్ట వరకు కంకరవేసి వదిలేశాడని, గాగిరెడ్డిపల్లి–సుందరగిరి గ్రామాల మధ్య రెండు కిలోమీటర్లు మాత్రమే బీటీ వేశారని ఆరోపించారు.

పత్తి చేను ధ్వంసంపై ఫిర్యాదు

శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల గ్రామ శివారులో పత్తి చేను ధ్వంసం చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కన్నాపూర్ గ్రామానికి చెందిన బాధిత రైతు అడితం శ్రీనివాస్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి పది గుంటల పత్తిచేనును మల్లయ్య, వెంకటేశం అనే వ్యక్తులు ధ్వంసం చేశారని ఫిర్యాదు చేశానన్నాడు.



ప్రమాదకరంగా కల్వర్టు

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి–లింగాపూర్ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా తయారైంది. భారీ వర్షాలు కురిస్తే కల్వర్టుపై రాకపోకలు నిల్చిపోయే అవకాశం ఉంది. గతంలో వర్షాలు కురిసినప్పుడు రాకపోకలు నిలిచిపోయిన సందర్భాలున్నాయి. హుజూరాబాద్ నుంచి మెట్‌పల్లి వైపు వాహనాలు కల్వర్టుపై నుంచి వెళ్తుంటాయి. మెట్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు కల్వర్టు గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం పొలాల వద్దకు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లేవారు వర్షాకాలంలో వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. కల్వర్టు స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తే రైతులతో పాటు ప్రయాణికుల ఇబ్బందులు తొలగుతాయని ప్రజలు వేడుకుంటున్నారు.





రామడుగు: కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కురుమ యువసేన సభ్యులు, చొప్పదండిలో కురుమ యువజన సంఘం సభ్యులు

దొడ్డి కొమురయ్యకు నివాళి

చొప్పదండి: పట్టణ కేంద్రంలో కురుమ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహం, చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడిగా అభివర్ణించారు. కార్యక్రమంలో కురుమ యువజన సంఘం అధ్యక్షుడు జిట్టు కుమార్, నిట్టు మునేశ్, పెద్ది సంపత్, రాజన్నల రాజు, గుంటి రాజశేఖర్, గుంటి మల్లయ్య, రాజన్నల తిరుపతి, తదితరుతుల పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలో కురుమ యువసేన యూత్ ఆధ్వర్యంలో కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. యువసేన సభ్యులు కడారి శ్రీనివాస్, కడారి రాజు, ఇరాల్ల కుమార్, మొగిలి శ్రీను, సంపత్, అంజి పలువురు పాల్గొన్నారు.

గన్నేరువరం: గొర్రెల, మేకలు పెంపకం దారుల సంఘం ఆధ్వర్యంలో గన్నేరువరంలో కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు జీల ఎల్లయ్యయాదవ్, మండల అధ్యక్షుడు మీసం రాములు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో గొల్ల కురుమలకు రావాల్సిన హక్కులను సాధించుకుంటామని 19 సంవత్సరాల ప్రారంభంలోనే ప్రాణత్యాగం చేసి పోరాటానికి దొడ్డి కొమురయ్య ఊపిరినిచ్చారని అన్నారు. నేటి సమాజానికి ఆయన పోరాట స్ఫూర్తి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో తమ్మనవేని శ్రీనివాస్, ముడికే బాలరాజు, దాడి మహేందర్, పాశం వేణు, సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, న్యాత శ్రీనివాస్, కొత్తపేట నాగరాజు పాల్గొన్నారు.



గన్నేరువరంలో...

రికార్డులను పరిశీలించిన డీఈవో

మానకొండూర్: మండల విద్యావనరుల కేంద్రాన్ని డీఈఓ జనార్దన్‌రావు ఆకస్మికంగా సందర్శించారు. ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ, పిల్లల హాజరుశాతం, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ మధుసూదనాచారి పాల్గొన్నారు.

డీఈవోకు వినతి

హుజూరాబాద్: జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొలంపెల్లి ఆదర్శన్‌రెడ్డి, గంప చంద్రశేఖర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చిట్యాల ఈశ్వరయ్య గురువారం డీఈవో జనార్దన్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. సాధారణ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ఇతర సిబ్బందికి సంపాదిత సెలవులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు.



డీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న తెలంగాణ టీచర్స్ యూనియన్ బాధ్యులు

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

హుజూరాబాద్: ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ ఆవిర్భావ దినోత్సవం గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ కొలుగూరి సూర్యకిరణ్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. దేశభక్తుడు నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అనుబంధ విభాగం ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్‌లో పనిచేయడం గర్వంగా ఉందని, ఏళ్లుగా విద్యారంగ సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకులు మాతంగి అంజి, బాలు తదితరులు పాల్గొన్నారు.



నోటుబుక్స్‌ను పంపిణీ చేస్తున్న సూర్యకిరణ్

నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట/రామడుగు/శంకరపట్నం/గన్నేరువరం: : నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌లో భాగంగా గురువారం ఆయా మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్, కాలేజీల బంద్ విజయవంతమైంది. ఈసందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. పేపర్ లీకేజీతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, విద్యార్థులకు, తల్లిదండ్రులకు భరోసా కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో విచారణ చేయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని, నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. పరీక్ష రాసిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. వైఖరి మార్చుకోకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మోదీ సర్కార్ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. 6న నిర్వహించే నీట్ కౌన్సిలింగ్‌ను కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుంటోందని, లీకేజీకి బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి

హుజూరాబాద్‌రూరల్: భవిష్యత్ తరాల బాగు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పిలుపు మేరకు మండలంలోని జూపాక గ్రామంలో బీజేపీ నాయకులతో కలిసి గురువారం మొక్కలు నాటారు. ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్‌లో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని సూచించారని తెలిపారు. పేద, ధనిక తేడా లేకుండా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 6న జిల్లావ్యాప్తంగా బీజేపీ నాయకులు అమ్మ పేరిట మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాముల కుమార్, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్‌రావు, మండల ఉపాధ్యక్షులు మహేశ్, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్, బూత్ అధ్యక్షుడు పంజాల రాజయ్య, రాజేశ్ తదితరులున్నారు.



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

జమ్మికుంట: అనారోగ్య కారణాలతో ఓ వృద్ధుడు పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపిన వివరాలు.. జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామ పంచాయతీ పరిధి కాపులపల్లి గ్రామానికి చెందిన బైరెడ్డి రామిరెడ్డి (83) ఆరేళ్లుగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది జమ్మికుంట పాత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పురుగుల మందు తాగాడు. గ్రామస్తులు, బంధువులు చికిత్స నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని, కుమారుడు సమ్మిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ఐదుగురిపై అదనపుకట్నం కేసు

జమ్మికుంట: అదనపు కట్నం తీసుకరావాలని వేధించిన ఐదుగురిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. మడిపల్లికి చెందిన శ్రీలతను మందమర్రికి చెందిన పెండ్యాల శ్రీనివాస్‌కిచ్చి ఎనిమిదేళ్ల క్రితం పెళ్లి చేశారు. రూ. 8 లక్షల కట్న కానుకలు అందజేశారు. కాగా భర్త శ్రీనివాస్, అత్త సారమ్మ, ఆడపడుచులు శ్రీవాణి, అనూష, మరిది శ్రీధర్ అదనపు కట్నం తీసుకురావాలని వేధించగా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా మార్పు రాకపోవడంతో శ్రీలత ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

40 క్వింటాళ్ల రేషన్‌బియ్యం స్వాధీనం

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెంలో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లాకు చెందిన ముగ్గురు వంకాయగూడెంలో అద్దెకు ఉంటూ ఆటోలో అల్లం, వెల్లుల్లి విక్రయిస్తూ రేషన్ బియ్యం సేకరించి నిల్వచేశారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్, కేశవపట్నం పోలీసులు గురువారం తనిఖీ చేశారు. బియ్యం స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసునమోదు చేశామన్నారు.

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి అవార్డు ప్రదానం



కలెక్టర్‌కు అవార్డు చూపిస్తున్న వైద్యాధికారులు

హుజూరాబాద్: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ అవార్డు ప్రదానం చేసిందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత తెలిపారు. ఐదురోజుల క్రితం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా చేతుల మీదుగా ఢిల్లీలో అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు. వైద్యాధికారులతో కలిసి గురువారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిశారు. 95 శాతం అచీవ్‌మెంట్ సాధించినందుకు ఏరియా హాస్పిటల్ అవార్డుకు ఎంపికైందని తెలుపడంతో కలెక్టర్ వారిని అభినందించారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన యాదవ సంఘం కార్యవర్గం సభ్యులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడిగా బొజ్జ ఎల్లయ్య నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం గ్రామంలోని యాదవ సంఘం భవనంలో సభ్యులు సమావేశమై ఉపాధ్యక్షుడిగా సందవేని రమేశ్, కార్యదర్శిగా బొజ్జ పర్శరాములు, డైరెక్టర్లుగా సందవేని ఐలయ్య, బొజ్జ లింగయ్య, పర్శరాములు, మహేందర్‌ను ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. అనంతరం సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.

6న ఇసుక వేలం

గన్నేరువరం: గన్నేరువరం గ్రామ పంచాయతీ శివారులోని మఠం సమీపంలో పలుగురాళ్ల వద్ద సీజ్ చేసిన పది ట్రాక్టర్ల ఇసుకకు 6న ఉదయం 11 గంటలకు ఇసుక వద్దనే వేలం నిర్వహించనున్నామని తహసీల్దార్ భిక్షపతి గురువారం ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా ఇసుక డంపులను పరిశీలించిన అనంతరం వేలంలో పాల్గొనాలని కోరారు, వేలంలో ఇసుకను పొందిన వారు 24 గంటల్లో మొత్తం డబ్బు చెల్లించి తీసుకెళ్లాలన్నారు.

విద్యార్థులకు స్వీట్లు పంపిణీ



స్వీట్లు పంపిణీ చేస్తున్న వెన్న రాజమల్లయ్య

రామడుగు: మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అధ్యక్షుడు రాజేశ్ లోహిత్య జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వివేకానందుడి మార్గంలో నడవాలి



వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న యువజన సంఘాల ప్రతినిధులు

రామడుగు: యువత స్వామి వివేకానందుడు చూపిన మార్గంలో నడుస్తూ ఉన్నత లక్ష్యాల సాధన ధ్యేయంగా ముందుకుసాగాలని జాతీయ యువజన అవార్డు గ్రహీత రేండ్ల కళింగ శేఖర్, అలువాల విష్ణు కోరారు. స్వామి వివేకానందుడు వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని వెదిర ఎక్స్‌రోడ్డు వద్ద స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వెదిర గ్రామ పంచాయతీ కార్యదర్శి, నాయకులు నాగుల రాజశేఖర్‌గౌడ్, అనిల్‌కుమార్, రాజు, యువజన సంఘాల ప్రతినిధులు అమిరిశెట్టి భూమిరెడ్డి, కొలిపాక కమలాకర్, పన్యాల అశోక్ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, మా రుతి, అంజన్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఆర్టీసీ సంస్థ లాభార్జనకు కళాకారుల ప్రదర్శన

హుజూరాబాద్: ఆర్టీసీ సంస్థ లాభార్జన ధ్యేయంగా ఉద్యోగులు చేపట్టాల్సిన చర్యలను కళాకారులు పాట రూపంలో వివరించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం కళాకారులు పాట రూపంలో ఉద్యోగులు సంస్థ అభివృద్ధి కోసం చేయాల్సిన లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిపో మేనేజర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్‌టీఐ ఎల్ సారయ్య, టీఐటూ వీవీఆర్‌రెడ్డి, ఉద్యోగులున్నారు.

బాసర ట్రిపుల్‌ఐటీకి విద్యార్థుల ఎంపిక



రామడుగు: పాఠశాల ఆవరణలో జనగామ రేష్మను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



గోగూరి గాయత్రి



కొమ్మెర రిషిత

మానకొండూర్‌రూరల్: మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్‌లో చదివిన మానకొండూర్ గ్రామానికి చెందిన కుందేల్ల అక్షయ, ముంజంపల్లి గ్రామానికి చెందిన గోగూరి గాయత్రి బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు మోడల్ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసిన ఏ. చరణ్, పి. హాసిని ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. ఈమేరకు ప్రిన్సిపాల్ కోల రమేశ్ విద్యార్థులను అభినందించారు. బాసర ట్రిపుల్ ఐటీలో చదవాలనే గ్రామీణ విద్యార్థుల కల మోడల్ స్కూల్ ద్వారా నెరవేరిందని తెలిపారు.

రామడుగు: మండలంలోని గుండి జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదివి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన జనగామ రేష్మను హెచ్‌ఎం భగవంతయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అభినందించి రూ. పదివేలు అందజేశారు. మాజీ సర్పంచ్ మానసప్రవీణ్, మాజీ ఎంపీటీసీ శ్యామ్‌సుందర్‌గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కొంరమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని గునుకులపల్లెకు చెదిన కొమ్మెర రిషిత బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపిక కాగా గ్రామస్తులు గురువారం సన్మానించారు. చిగురుమామిడికి చెందిన దాసరి సిరివైష్ణవ్యకు ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. మండలం నుంచి ఇద్దరు సీట్లు సాధించడంపట్ల హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

సాగు భూమికే రైతు భరోసా ఇవ్వాలి



మాట్లాడుతున్న చైర్మన్ వెంకట్‌రెడ్డి

సైదాపూర్: ప్రభుత్వం సాగయ్యే భూములకు మాత్రమే రైతుభరోసా ఇవ్వాలని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం వెన్నంపల్లి సహకార సంఘం ఆవరణలో చైర్మన్ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో రైతుభరోసా అమలుపై రైతుల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. సమావేశానికి వచ్చిన రైతుల్లో ఎక్కువ మంది ఐదెకరాల వరకే పెట్టుబడి సాయం ఇవ్వాలన్నారు. వ్యవసాయశాఖ సిబ్బందితో సర్వే చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంకు సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఏఈవో రజిత, సీఈవో మల్లారెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.